క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మియాపూర్ : సురక్ష ఫీడర్, భవానీపురం ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సురక్ష ఫీడర్ పరిధిలోని కైలాస్ నగర్, విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, పద్మజా కాలనీ, సురక్షహిల్స్, రాజేందర్‌రెడ్డినగర్ కాలనీ, శుభోదయ ఎన్‌క్లేవ్, డిఫెన్స్ కాలనీ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు భవానీపురం ఫీడర్ పరిధిలోని వేమనరెడ్డి కాలనీ, ఆర్వీ ఉద్యాన్ అపార్ట్‌మెంట్, వికార్ సెక్షన్ కాలనీ, భవానీపురం, శంకర్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన వివరించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో...
టమాట 45, పచ్చిమిర్చి 80, బెండ 45, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 140, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 70, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 160.

శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేస్తున్న శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

హఫీజ్‌పేట్ : న్యూ హఫీజ్‌పేట్ ప్రేమ్ నగర్‌లోని పోచమ్మ తల్లి దేవాలయం వద్ద ఉన్న పేద ప్రజలకు శ్రీరామ దూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ శ్రీరామదూత చారిటబుల్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద ప్రజలకు వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రమణరావు, మూర్తి, ఇందిరాదేవి, యజ్ఞేశ్వర్, కాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫినిక్స్ ఎరీనాలో క్యూయర్ ఫిఎస్టా



క్యూయర్ ఫి ఎస్టాలో ఏర్పాటు చేసిన స్టాల్స్

మాదాపూర్: కళాకారులు మాదాపూర్‌లోని ఫినిక్స్ ఎరీనాలో పలు అంశాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మహిళ వ్యాపారవేత్తలు పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసిన ఉత్పత్తులను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. కళాకారుల సింగింగ్, నృత్య ప్రదర్శనలు, డాన్స్, డ్రామాల ప్రదర్శన ఆకట్టుకుంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గురుకుల బాలికల సత్తా

- 13 మందికి ఐఐటీ...

20 మందికి ప్రిపరేటరీ ఐఐటీ సీట్లు



అశ్విని (980 ర్యాంకు)

రాయదుర్గం: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల బాలికలు సత్తా చాటరు. 71 మంది బాలికలు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరు కాగా అందులో 13 మంది మందికి ఐఐటీ సీట్లు దక్కాయి., మరో 20 మందికి ప్రిపరేటరీ ఐఐటీ సీట్లకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శారద ఆదివారం తెలిపారు. మొత్తం విద్యార్థుల్లో 980 ర్యాంకుతో అశ్విని, వర్ష 3,104 ర్యాంకు, నవ్యశ్రీ 4,987 ర్యాంకులను సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారని ఆమె పేర్కొన్నారు. ఆర్‌సీఓ డాక్టర్ శారద, ఓఎస్‌డీ రంగారెడ్డి సూచనలు, ఆదేశాలతో అధ్యాపకులు ప్రోత్సాహంతో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారన్నారు. 33 మందికి ఐఐటీ సీట్లు రావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని సీట్లు సాధిస్తామనే నమ్మకం ఏర్పడిందన్నారు. నీట్, వార్షిక పరీక్షలలో కూడా బాలికలు సత్తా చాటారన్నారు.



వర్ష (3,104 ర్యాంకు)



నవ్యశ్రీ '4,987 ర్యాంకు)

ఫలించనున్న నిరీక్షణ

- పూర్తి కావచ్చిన 'మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్' నిర్మాణం
- నెల రోజుల్లో అందుబాటులో..
- 2015లో రూ.1.72 కోట్లతో పనులు మరూ
- జాప్యం కారణంగా 2022లో రూ.1.70 కోట్లు అదనపు నిధుల కేటాయింపు
- మిగిలిన విద్యుత్, ప్రహరీ నిర్మాణ పనులు
- ఇదీ గోపన్‌పల్లితాండ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ పరిస్థితి'



రాయదుర్గం: ఎట్టకేలకు గోపన్‌పల్లి తండాలో చేపట్టిన మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తికానుంది. ఎనిమిదేళ్ల నిరీక్షణకు మోక్షం లభించనుంది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, గచ్చిబౌలి కార్పొ రేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా చొరవతో అదనపు నిధులు మంజూరు చేయడంతో నిలిచి పోయిన పనులు ఊపందుకున్నాయి. ఈ మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తయితే గోపన్‌పల్లితాండ తోపాటు గోపన్‌పల్లి, వీకర్‌సెక్షన్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్, తాజ్‌నగర్, సోఫియా కాలనీ, గౌలిదొడ్డి, బసవ తారకనగర్, కేశవనగర్, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి తదితర ప్రాంతాలలో నివాసముండే సుమారు 20వేల మందికి ఎంతో ఉప యుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం పేద, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాల వారు శుభ కార్యాలయాలు చేసుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో రూ. లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయితే వారందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

నిర్మాణ వివరాలివీ...

- 2015 అక్టోబర్ 29న రూ.1.72 కోట్లతో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గోపన్‌పల్లి తాండలో అప్పటి రవాణా శాఖామంత్రి డాక్టర్ పి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.
- వెంటనే పనులను ప్రారంభించినా నిధుల కొరత కారణంగా గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌తో నిర్మాణం ఆగిపోయింది.
- స్థానికుల డిమాండ్ మేరకు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించిన అధికారులు ఆమేరకు చర్యలు చేపట్టారు.

కొత్తగా చేపట్టిన పనులు ఇవీ....

- రూ.1.70 కోట్లతో 2022 జూన్ 21న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు.
- ఈ నిధులతో ఏడేళ్ళ క్రితం ఆపివేసిన గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, కిచెన్, మూత్రశాలలు, స్నానపుగదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు ఏర్పాట్లు, కొత్తగా ప్రధాన గేటు, గ్రీనరీ, ప్రహరీ, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.
- ఈ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- పనులన్నీ పూర్తి కాగా ప్రస్తుతం విద్యుత్ సరఫరా, ప్రహరీ, మైనర్ రిపేర్లు, గ్రీనరీ ఏర్పాటు చేస్తే ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేయనున్నారు.

నాలుగేళ్ల ప్రతిపాదనలకు మోక్షం....

- కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై 'సాక్షి'లో పలు మార్లు కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించి తాజాగా అదనపు నిధులను మంజూరు చేయడంతో దీనికి మోక్షం లభించినట్లయింది.
- గతంలో కార్పొరేటర్‌గా ఉన్న కొమిరిశెట్టిసాయిబాబా, ప్రస్తుత కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పలు మార్లు నిర్మాణాన్ని ఎమ్మెల్యే గాంధీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
- నాలుగేళ్ల క్రితం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని అదనంగా నిధులు మంజూరు చేయించడంతో పనులు ఊపందుకున్నాయి.

ప్రజల కల నెరవేరుస్తున్నాం..

గోపన్‌పల్లితాండలోని మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మాణం ప్రజల ఎన్నో ఏళ్ల కల, దీనిని అతి త్వరలో సాకారం చేస్తాం. దాదాపు పనులన్నీ పూర్తి కావచ్చాయి, అతి త్వరలో హాల్‌ను ప్రారంభించి ప్రజలు శుభ కార్యాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తాం. తక్కువ వ్యయంతో ఈ ప్రాంత ప్రజలకు తమ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. సుమారు 20వేల మందికి ప్రయోజనకరంగా ఉంటుంది.

–గంగాధర్‌రెడ్డి–గచ్చిబౌలి కార్పొరేటర్





మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్

‘ఐఎస్‌బీ’లో పుస్తక పరిచయ కార్యక్రమం



లెర్న్, డోంట్ స్టడీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) లో ఆదివారం సాయంత్రం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఐఎస్‌బీలోని ఖేమ్కా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్, హరప్పా ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ప్రమత్ రాజ్ సిన్హా రచించిన 'లెర్న్, డోంట్ స్టడీ' అనే పుస్తకాన్ని ప్రస్తుత ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల ఆవిష్కరించి, పరిచయం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమత్ రాజ్‌సిన్హా, ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల మధ్య ప్రత్యేక సంభాషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సిన్హా మాట్లాడుతూ వృత్తిపరమైన జీవితంలో అత్యంత ముఖ్యమైన, సవాల్‌గా మారిన సమస్యలను ఎదుర్కొంటున్న యువత కోసం ఉత్తమమైన, అత్యంత ఆచరణాత్మకమైన సలహాలను పొందుపరిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఐఎస్‌బీ ఏర్పాటు, సాధించిన ప్రగతి తదితర అంశాలతోపాటు పుస్తకం ప్రాధాన్యతపై ఇద్దరి మధ్య ఆసక్తికరమైన సంభాషణలు సాగాయి. కార్యక్రమంలో పలువురు ఐఎస్‌బీ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న పీజేఆర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా దినోత్సవ కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్‌కెవై ఫౌండేషన్‌ల సహకారంతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కరపత్రాన్ని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందన కృపాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శివకుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్‌ల ట్రస్టుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చందానగర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్ తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎనిమిదేళ్లుగా పీజేఆర్, వివిధ పార్కుల్లో యోగా క్లాసులు జరుగుతున్నాయన్నారు. ఆరోగ్యం కోసం ప్రజలందరు యోగా చేస్తున్నారన్నారు. చిన్న చిన్న రోగాల నుంచి కేన్సర్ నివారణకు యోగా దోహదం చేస్తుందన్నారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ యోగాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారన్నారు. ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు గంగుల రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, నాయకులు గంగుల నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యాంశాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ప్రవళిక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను అలరించింది. ఇందులో జయము జయము, భజమానస, జతిస్వరం, బాలగోపాల తరంగం, తక్కువేమి మనకు, మరకతమణిమయ, వినాయకశబ్దం, కృష్ణలీలలు, తిల్లాన, తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు ప్రవళిక, యుక్త, మేధ, సంచిత, హంసిని, చిన్మయి, నక్షత్ర, భవాని, జెశ్విత, శివాని, మాన్య, అనన్య, చంద్రిక, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాహిత్య విమర్శకు వస్తు, శిల్పాలు రెండూ అవసరమే

హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు



రాయదుర్గం: సాహిత్య విమర్శకు వస్తు, శిల్పాలు రెండూ అవసరమేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆన్‌లైన్ ద్వారా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి ఆయన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘం ప్రధాన కార్యదర్శి, రచయిత వల్లూరి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాహిత్య విమర్శకుడికి ఒక దృక్పథం ఉంటుందని అయితే ఆ దృక్పథం రచనలోని ఉత్తమ లక్షణాలను నిరోధించేలా ఉండ కూడదని, వక్రభాష్యాలిచ్చేలా మారకూడదన్నారు. తెలుగు సాహిత్య విమర్శ రంగంలో తనదైన ముద్ర వేసిన వల్లంపాటి భారతీయ సాహిత్య సిద్ధాంతాలు, పాశ్చాత్య సాహిత్య విమర్శ మౌలికాంశాలను లోతుగా అధ్యయనం చేసిన ఉత్తమ విమర్శకుడన్నారు. రాయలసీమ భౌగోళిక చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక మూలాలను ఆధారం చేసుకుని సామాజిక, సాంస్కృతిక దృక్పథంతో సాహిత్యాన్ని అనుశీలించడం నేర్పిన సైద్ధాంతిక విమర్శకుడని పేర్కొన్నారు. వల్లంపాటి శిల్పం, ఇతర వ్యాసాలు సాహిత్య విమర్శకారులకు దారి దీపాలన్నారు. ఆయన అనువదించిన గ్రంథాలన్నీ చరిత్ర, సామాజిక, సాహిత్య రంగాలలో అభ్యుదయకరమైన ఆలోచనలకు ప్రేరకాల న్నారు. కార్యక్రమంలో ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎ.ఎంఆర్ ఆనంద్, వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, డాక్టర్ బడిగె ఉమేశ్, డాక్టర్ పెద్దింటిముకుందరావు, డాక్టర్ బాసెట్టిలత, డాక్టర్ రాంప్రసాద్‌నలసాని, కెపి అశోక్‌కుమార్, యు అప్పలరాజు, ఎం జయేదేవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి




సమస్యలు తెలుసుకుంటున్న రవికుమార్ యాదవ్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్ డివిజన్‌లో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం గడప గడపకు పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆయన 58వ రోజు మాదాపూర్ డివిజన్‌లోని నవభారత్‌నగర్, కాకతీయహిల్స్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడ చూసిన రోడ్లు, డ్రైనేజీ, వ్యవస్థ సరిగ్గా లేదన్నారు. శానిటైజేషన్ సిబ్బంది లేక చెత్త పేరుకుపోయిందన్నారు. కొత్తరేషన్ కార్డులు, పెన్షన్లు, డబుల్‌బెడ్‌రూం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి బీజేపి కండువాలను కప్పి ఆహ్వానించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి 40శాతం నిధులు సమకూరుతున్నా, వసతుల కల్పనపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని, స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో పేదలపై అప్పుల భారం...

మియాపూర్: అమరుల ఆశయాలు, ఆకాంక్షలను తొంగలో తొక్కి కల్వకుంట కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకు తింటూ ప్రజలపై అప్పుల భారాన్ని మోపిందని ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీలో ఆదివారం ఆయన గడపగడపకు బీజేపీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరిస్తూ.. బీజేపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీలో మంచినీటి సమస్య, రోడ్డు సమస్య, డ్రైనేజీ సమస్య, రేషన్ కార్డు, పింఛన్, ఇంటి పట్టాల సమస్యలను బీజేపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యవతి అదృశ్యం



మౌనిక (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : ఓ యువతి అదృశ్యమైన సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం పాశమైలారానికి చెందిన పోచయ్య, లలిత దంపతుల కూతురు మౌనిక(20). పదో తరగతితో చదువు ఆపేసి ఇంటి వద్దే ఉంటోంది. శనివారం అర్ధరాత్రి లలిత నీళ్లు తాగేందుకు లలిత లేవగా మౌనిక కూడా నిద్ర లేచి ఉంది. మరోసారి లలితకు మెళకువ రాగా భర్తను ఇప్పుడు టైం ఎంత అని అడిగింది. ఫోన్‌లో భర్త టైం చూసేందుకు యత్నించగా కనిపించ లేదు. అర్ధరాత్రి ఒంటి సమయంలో మౌనిక ఫోన్ తీసుకొని ఇంటి నుండి వెళ్లిపోయిందని తల్లి పేర్కొంది. ఆమె కోసం తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. సెల్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందని తల్లి తెలిపింది. కూతురు అదృశ్యంపై లలిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి చేయూత

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని సాయికృప అపార్ట్‌మెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ స్థానికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య, మెట్రో స్టేషన్ విస్తరణ, సర్వీస్ రోడ్డు, ఓపెన్ జిమ్, అమ్మవారి టెంపుల్ నిర్మాణం తదితర సమస్యలను స్థానికులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానన్నారు. విద్యార్థి మనస్విని చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుందని బండి రమేష్ దృష్టికి తేగా స్పందించిన ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, సురేష్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో తాగునీటి కష్టాలకు చెల్లు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: గత ప్రభుత్వాల పాలనలో బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితుల నుంచి పొయ్యి దగ్గరకే మంచినీళ్లు అందించిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో ఆదివారం మంచినీళ్ల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం వంద శాతం విజయం సాధించిందన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి పటాన్‌చెరు నియోజకవర్గంలో 10 వేల నల్లా కనెక్షన్లు ఉంటే నేడు 40 వేలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, గ్రామ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ శ్రీశైలం, ఉప సర్పంచ్ శోభ, ఎంపీడీఓ బన్సీలాల్, గ్రామీణ నీటిపారుదల విభాగం డీఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్క్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి,నాయకులు

ఘనంగా మంచినీళ్ల పండగ

మియాపూర్: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మంచినీళ్ల పండగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 18 రిజర్వాయర్లను నిర్మించామని, మిషన్ భగీరథ ద్వారా కాలనీలు, బస్తీల్లో ఇంటింటికి మంచి నీటి నల్లా కనెక్షన్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ 20వేల లీటర్ల నీటిని ఉచితంగా అందిస్తుందని తెలిపారు. మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా పవర్ బోర్లను కూడా ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, డీపీ వెంకన్న, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, పూజిత గౌడ్, మంజుల రఘునాథ్‌రెడ్డి, డీజీఎం నాగప్రియ, శరత్‌రెడ్డి, జలమండలి సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదు



పాపిరెడ్డి కాలనీ నేతలను పార్టీలోకి ఆహ్వానించిన రవి కుమార్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్ యాదవ్ అన్నారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన పలువురు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి హైదరాబాద్ నుంచి ఆదాయం వస్తుండగా, హైదరాబాద్‌కు శేరిలింగంపల్లి నుంచే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఆదాయం వచ్చే ప్రాంతాల్లోనూ మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. రోడ్లు, డ్రైనేజీ, మంజీరా పైప్ లైన్లు, ఇళ్ల పట్టాలు, వీధి దీపాల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, ట్రైబల్ యూనివర్సిటీ, గిరిజన బంధు పథకాల ఊసేలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చే హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉంటామని బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనీల్, అరుణ, ఆశీష్, సాయి , దిలీప్, లోకేష్, వెంకట్, దీక్షిత్, ఆకాశ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.